లేకుండా, ఏకాగ్రత లేకుండా ఈశ్వరానుభవం నీకు కలుగదు. కొంతమంది భగవాన్‌తో ఏమని చెప్పేవారు అంటే నేను నిన్ను పట్టుకొన్నాను. ఇప్పడు నిన్ను విడిచిపెట్టేయాలని ఉంది, నా పట్టు వదిలేసానుగాని నన్ను నువ్వు వదలటం లేదు అనేవారు. ఒకవేళ మనకు గురువు మీద కోపం వచ్చి ఆయనను వదిలేసినా ఆయన మనలను విడిచిపెట్టడు, ఆయన ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయికి మనలను తీసుకొనిపోయే వరకు జన్మజన్మలకు మనలను వెంటాడతాడు, మనలను విడిచిపెట్టడు, వాడు గురువు. గురువు ప్రేమ లోకానికి సంబంధించిన ప్రేమకాదు. అది అలౌకికమైనది, అభౌతికమైనది. చైతన్యం యొక్క స్వరూపమే ప్రేమ. అది మనలు పట్టుకొన్నప్పడు ఇంక మనం ఎక్కడికి వెళ్ళలేము. మన ఇంట్లో ఒకరిని ఒకరు ప్రేమించుకొన్నా మరల ప్రేమించటం మానేస్తాము, ఈ ప్రేమలు లౌకికమైనవి, ఇవి కేవలం జీవలక్షణాలు. ఒక్కసారి మీరు గురువు యొక్క అనుగ్రహంలో పడితే మీ లోపల ఉన్న అజ్ఞానాన్ని శుభ్రంగా తొలగించే వరకూ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మనలో ఉన్న మాయను, అజ్ఞానాన్ని తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, వాడు గురువు. ప్రతీ చిన్నవిషయానికి మనస్సులో అల్లరి పెట్టుకోవద్దు, మీరు శాంతిని కాపాడుకోండి. ఎందుచేతనంటే శాంతిని కాపాడుకోకపోతే సాధన జరుగదు. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో శాంతిని కాపాడుకోండి. పురుషుడికి నిజమైన భార్య శాంతే, స్త్రీకి నిజమైన భర్త శాంతే. మీకు శాంతి కుదిరింది అనుకోండి మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. సంసారంలో గొడవలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, లోకానికి సంబంధించిన గొడవలు, ప్రకృతికి సంబంధించిన గొడవలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాని మీరు శాంతిని కాపాడుకోండి, అదే సాధన యొక్క గమ్యం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-02-2009, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు అవకాశం ఉన్నంతవరకు సత్కర్మ చేయటం మంచిది. మన రూపం, మన నామం మరిచిపోయి మనం పని చేసినా అది సత్కర్మే. మనం జపం చేస్తున్నాము, సత్కర్మ చేస్తున్నాము, యాత్రలు చేస్తున్నాము వీటి అన్నింటి యొక్క ప్రయోజనం మనస్సును బాగుచేసుకోవటమే. మన ఇంద్రియాలను సద్వినియోగం చేసుకొని మనస్సును బాగు చేసుకోవాలి. మనం ఈ భూమి మీదకు వచ్చిన పని అది. మనం ఈ భూమి మీదకు వచ్చి మరల ఈ భూమిని విడిచిపెట్టి వెళ్ళేటప్పటికి మనం ఎంతోకొంత మనస్సును పవిత్రం

చేసుకోవాలి. ఎందుచేతనంటే మరణానంతరం ప్రయాణించేది మనస్సే, ఈ మనస్సునే జీవుడు అంటారు. ఈశ్వరుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. ఈ జీవులనందరినీ ఆడించేవాడు ఆయనే, జీవులలో అంతర్యామిగా ఉన్నవాడు కూడా ఆయనే. ఈ దేహాలు అన్నీ స్వప్నశరీరాలు. ఈ ప్రపంచం అంతా మనస్సు యొక్క కల్పితమే. ఈ బంధుత్వాలు, స్నేహాలు, విరోధాలు ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితం. నీకంటే వేరుగా ఈ ప్రపంచం ఉందని ఆ తలంపును తీసుకొనివచ్చేది కూడా మనస్సే. శరీరం వచ్చింది అంటే దుఃఖం వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు. అయితే శరీరం మనం రావద్దు అంటే ఆగుతుందా? ఆగదు. మనకు భోగదృష్టి ఉన్నంతకాలం, కోరికలు ఉన్నంతకాలం శరీరం వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు. భోగదృష్టి ఉన్నంతకాలం, జీవలక్షణాలు ఉన్నంతకాలం జీవుడు హృదయంలో లయం అవ్వడు. మనం బలవంతంగా లోపలకు గెంటినా బయటకు వచ్చేస్తాడు. అంటే ఏదో ఒక వాసన, ఏదో ఒక బలహీనత వాడిని బయటకు తీసుకొని వచ్చేస్తుంది. దేహం రాకుండా చెయ్యాలంటే మనం నామరూపములను మర్చిపోయి పనిచేయాలి. సర్వ సాధారణంగా మంచిపనులు చేసేవారు కూడా గౌరవాల కోసం చేస్తారు. గౌరవం ఎవరికి మనస్సుకి. మీరు మంచిపనులు చేస్తే పుణ్యం వస్తుంది కాని జన్మరాహిత్యస్థితి రాదు. ఏదో గౌరవం ఆశించి మంచిపనులు చేయటంకాదు, మంచి మంచికోసమే చేయాలి.

ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఎవరిని ఉపాసన చేసినా మనకు ఈ దేహమే నేను, ఈ మనస్సే నేను అనే తలంపు ఉంది కదా దీనిలో నుండి బయటకురాకుండా మీకు పునర్జన్మలేనిస్థితి రాదు, ఇందులో రాజీలేదు అని చెప్పారు. మీరు శరీరం రాకుండా చేసుకోవాలి అంటే ఆసక్తి లేకుండా పనిచెయ్యాలి, పని పనికోసమే చేయాలి. కాని మనం దేహము నేను, మనస్సు నేను అనే తలంపును ముస్తాబు చేసుకోవటానికి పనిచేస్తున్నాము. అంటే ఏ మనస్సును బాగుచేసుకోవాలి అనుకొంటున్నామో ఒకరకంగా దానిని పాడుచేస్తున్నాము. మీరు చేసేపని మనోనాశనానికి ఉపయోగపడాలికాని మనస్సు పెరిగే పనులు చేయకూడదు, కర్మ అంటే అది, మనం చేసే పని మనలను బంధించకూడదు. మనం డ్యూటీ చేస్తూ ఉండాలి, ఆసక్తి పెట్టుకోకూడదు. ఆసక్తి పెట్టుకొంటే కొత్తవాసనలు వస్తాయి. మనం తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనకు చెడు తలంపులు ఎక్కువగా వస్తూ ఉంటే చెడ్డ పనులు చేసేస్తాము అందుచేత చెడుతలంపులు రాకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. మీలో కొంతమందికి ఇంటి దగ్గర డబ్బు ఉండవచ్చు, సంపదలు ఉండవచ్చు, గౌరవాలు

ఉండవచ్చు, నౌకరులు ఉండవచ్చు కాని అందరికి ఆధ్యాత్మిక దారిద్ర్యం ఉంది. ఎందుచేతనంటే ఆ సంపదను మనం సంపాదించుకోవటం లేదు, దాని గురించి మనం ప్రయత్నం చేయటంలేదు. పాండిత్యం, ధనం, గౌరవాలు ఇవిఅన్నీ లోకానికి సంబంధించినవి. భక్తి వలన మనకు ముక్తి వస్తుంది. మనం రూపబుద్ధిని, నామబుద్ధిని తగ్గించుకోవాలి. మనకు ఒక రూపం ఉంది, ఆ రూపానికి ఒక నామం పెట్టారు, ఈ రెండూ కల్పితమే. ఈ రూపబుద్ధి నుండి, నామబుద్ధినుండి మనస్సు ఆహారం తీసుకొంటోంది. మనస్సుకు ఆహారం వెళ్ళే ఆరూట్‌ను కట్ చేయాలి. ఆ రూట్‌ను కట్ చేయాలి అంటే రూపచింతన, నామచింతన తగ్గించుకోవాలి. అంటే మన రూపాన్ని, మన నామాన్ని పూర్తిగా మర్చిపోవాలి, అప్పడు కాని మనస్సుకు వెళ్ళే ఆహారం కట్ అవ్వదు. అందుచేత సాధనలో, ఈ ఆధ్యాత్మికమార్గంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు.

మనం ఏదైనా ఒకమాట మాట్లాడితే, ఏదైనా ఒక పని చేస్తే, ఏదైనా ఆలోచిస్తే చిత్తశుద్ధి కోసం చేయాలి. మనం ఏదైనా ఒక పనిచేసి ఈ పని నావల్లే అయ్యింది, నేను చేస్తున్నాను అనుకొంటే అవన్నీ పునర్జన్మలకి కారణాలు అవుతాయి. మనం చేసాము అనుకొంటాముకాని చేసింది ఈశ్వరుడే, ఇంతమంది కర్తలు లేరు, కర్త ఒక్కడే, ఆయనే ఈశ్వరుడు, ఉన్న వస్తువు ఒక్కటే, అదే అనేక వేషాలను వేసుకొని వస్తుంది. మనకు పునర్జన్మ కారణాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. అందుచేత మనోనాశనానికి ప్రయత్నం చేయాలి, అదే మన సాధన యొక్క గమ్యం. పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు తిరిగిపుడతాడు, అది సహజం. కాని ఈ జననమరణ ప్రవాహంలో నుండి నువ్వు ఎలా బయటకు రావాలో చూసుకో. కేవలం యోగాభ్యాసాల వలన మనస్సు నశించదు. సత్కర్మ చేయటం వలన, ధర్మాన్ని ఆచరించటం వలన, భగవంతుడు చెప్పినట్లు జీవించటం వలన మనస్సు నశిస్తుంది. శాస్త్రంలో ఏమనిచెప్పాడు అంటే ఎవడైతే తనను తాను పోగొట్టుకొంటాడో వాడికి మాత్రమే వస్తువు దొరుకుతుంది. అంటే ఎవడైతే దేహాభిమానాన్ని విడిచిపెట్టాడో వాడికి మాత్రమే హృదయంలో ఉన్న బంగారం దొరుకుతుంది. మీ బిడ్డలు మంచివారు అయ్యి ఉండవచ్చు, మీకు ఇంటినిండా సంపదలు ఉండవచ్చు, కాని మీరు దేనితోటి తాదాత్మ్యం పొందవద్దు. నీ శరీరమే నీది కానప్పడు అందులో ఏది నీది అవుతుంది. అంటే ఏదీ నీది కాదు. మీ దేహ ప్రారబ్ధంలో ఐశ్వర్యం ఉంటే మీ కోరికతో నిమిత్తం లేకుండా అది వస్తుంది మీ కోరికతో సంబంధం లేకుండా మీకు ఏది వచ్చినా అది మిమ్మల్ని బంధించదు. మీ కోరికతో తెచ్చుకొన్నది మిమ్మల్ని బంధిస్తుంది. మీకు

ఆత్మజ్ఞానం కావాలంటే ముందు ఆత్మ గుణాలను సంపాదించు కోవాలి. జీవలక్షణాలు మనస్సును చంపవు. మీరు ఆత్మగుణాలను, కళ్యాణగుణాలను అలవర్చుకొంటే అవి మనస్సును చంపుతాయి. ఎవడికైతే ఆత్మగుణాలు ఉన్నాయో వాడు ఆనందం కావాలి అని అడగనక్కరలేదు. ఆనందం వచ్చి వాడిని వరిస్తుంది. వాడికి సహజం గానే మోక్షం వస్తుంది.

మనకు దూరదృష్టి ఉండాలి, ఒక ప్లానింగ్ ఉండాలి. జీవితంలో అన్నింటికంటే క్రమశిక్షణ ముఖ్యం. భగవంతుడి పట్ల చలనం లేని విశ్వాసం ఉండాలి. సుగ్రీవుడితో రాముడు స్నేహం చేసినప్పుడు రాముడు ఏమన్నాడు అంటే అగ్నిసాక్షిగా మనం ప్రమాణం చేస్తున్నాము. నీ కష్టంలో నేను విడిచిపెట్టను అలాగే నా కష్టంలో నువ్వు విడిచిపెట్టకు. నీ సుఖంలోకూడా నేను విడిచిపెట్టను, నా సుఖంలో నువ్వు విడిచిపెట్టకు అన్నాడు అంటే వాడి సుఖం వీడి సుఖం అనుకోవాలి, వాడి దుఃఖం వీడి దుఃఖం అనుకోవాలి, అది మైత్రి, అవి కళ్యాణగుణాలు. మీరు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేస్తూ ఉంటే దేవుని దయ కూడా వస్తుంది. జ్ఞానానికి మించిన వస్తువుగాని, జ్ఞానంతో సమానమైన వస్తువుగాని ఈ లోకంలో లేదు. అందుచేత మన లక్ష్యం జ్ఞానంవైపుకే ఉండాలి. మనం హృదయపూర్వకంగా జ్ఞానంకోసం ప్రయత్నం చేస్తూ ఉంటే బండరాళ్ళవంటి వాసనలు ఉన్నా జ్ఞానమే ఆ వాసనలను దహనం చేస్తుంది. మనిషి బయటకు చూడటం అలవాటు పడిపోయాడు. నువ్వు లోపలకు చూడటం నేర్చుకో, అప్పుడు మనస్సు అంతర్ముఖమవుతుంది, అంతర్ముఖం అయితేగాని మనస్సు నశించదు. మనస్సు నశిస్తేనేగాని ఆత్మజ్ఞానం రాదు. సత్పురుషులతో సహవాసం చేస్తూ ఉంటే నీకు దేహంతో ఉన్న సంబంధం, ప్రపంచంతో ఉన్న సంబంధం, విషయాలతో ఉన్న సంబంధం నీకు తెలియకుండా పల్చబడి రాలిపోతుంది. సజ్జనసహవాసం దొరికితే సహజం గానే నీ మనస్సుకు లోచూపు కలుగుతుంది. మనస్సుకు లోచూపు కలుగకుండా జ్ఞానం మాట అటు ఉంచండి, భౌతికవిషయాలను కూడా వాడు ఏమీ కనిపెట్టలేడు. ఎవడైతే తనని తాను పూర్తిగా మరచిపోయాడో వాడే గొప్పపనులు చేయగలడు. నిరంతరం నీకు నువ్వే జ్ఞాపకం వస్తూ ఉంటే ఇంక జ్ఞానం ఏమిటి, నీకు జ్ఞానం ఎలా వస్తుంది. నువ్వు సాధ్యమైనంతవరకు హోలీకంపెనీలో ఉండు. హోలీమేన్ ద్వారా శాంతితరంగాలు, కాంతి తరంగాలు ప్రవహిస్తూ ఉంటాయి. వారి సమక్షంలో ఉన్నప్పుడు ఎంతోకొంత వాటి ప్రభావం నీమీద ఉంటుంది.

నువ్వు ఎక్కడ ఉన్నా దైవచింతన విడిచిపెట్టవద్దు. నీ దేహం ఎక్కడ ఉంది అనేది ప్రధానం కాదు, నీ మనస్సు ఎక్కడ ఉంది అన్నదే ముఖ్యం. అందుచేత భగవంతుడితో

మానసికఅనుబంధం కలిగిఉండు. ఆత్మానుభవం పొందటానికి చాలా రకాల సాధనలు చెపుతారు. తుకారామ్ ఏమన్నాడు అంటే ఇతరుల గొడవ నాకు ఎందుకు, ఓ విఠల్! నాకు సంబంధించినంతవరకు నేను తరించటానికి నీ నామం సరిపోతుంది అన్నాడు. నీ నామమే నాకు చాలు, అది బోటులాగ ఉపయోగపడి ఈ సంసార సముద్రం నుండి నన్ను ఒడ్డుకు తీసుకొని వస్తుంది అని చెప్పాడు. నాకు ఏదైనా కష్టం వచ్చినా అది నీకు తెలియకుండా రావటం లేదు, నాలోని బలహీనతలను తొలగించటానికే ఆ కష్టాలను నీవు పంపిస్తున్నావేమో నాకు తెలియదు. నిన్ను కాదని కోరేవాడు ఇక్కడ ప్రత్యేకంగా ఎవడూ లేడు. ఇదంతా నీ లీల. ఈ దేహము నేను అనే తలంపును పోగొట్టుకోవటానికి నేను ప్రత్యేకంగా ఏమీ ప్రయత్నం చేయలేదు. ఆ పాండురంగడి ప్రేమలో, ఆ ప్రవాహంలో నాకు తెలియకుండానే అది కొట్టుకొని పోయింది అన్నాడు తుకారామ్. నిరంతరం పాండురంగడి స్మరణ వలన తుకారామ్‌కు అమృతానుభవం కలిగింది.

ఈ కలియుగం చీకటి యుగం, ఇక్కడ మంచికంటే చెడ్డ ఎక్కువగా ఉంటుంది, అధర్మం గురించి చెప్పేవారు ఎక్కువ ఉంటారు, ఇది కలిప్రభావం. ఇక్కడ ధర్మాన్ని ఆచరించే వారిని, మంచి చేసేవారిని చూసి హేళన చేయవచ్చు. మంచి చేయటానికి ఎవరూ ఎంకరేజ్‌మెంట్ ఇవ్వరు. ఈ ప్రవాహానికి ఎదురునిలబడి నువ్వు రవ్వంత ధర్మాన్ని ఆచరించినా అనంతమైన ఫలితం వస్తుంది అని ఆచార్యులవారు చెప్పారు. నీ మనస్సు నిర్మలంగా ఉంటే, నీ మనస్సు శాంతిగా ఉంటే, నీ మనస్సు ఆనందంగా ఉంటే నువ్వు ప్రజల మధ్యకు వెళ్ళి బోధించనక్కరలేదు, నీవు అనుభవిస్తున్న శాంతి, ఆనందం ఈ లోకం అంతా వ్యాపిస్తుంది. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేయండి, ఆ దేహం ద్వారా ఏ పని జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది, దానితో నువ్వు తాదాత్మ్యం పొందవద్దు, భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసుకో. నీ దేహానికి ఏదో ప్రారబ్ధం ఉంటుంది. ఆ ప్రారబ్ధాన్ని ఇష్టంతోటి అనుభవించు. మనందరం ప్రారబ్ధాన్ని అయిష్టంతో అనుభవిస్తాము. మీ అత్తగారు అంటే మీకు ఇష్టం లేకపోయినా ప్రొద్దుటే కాఫీ ఇవ్వటం ఎలాగూ తప్పదు, అయిష్టంగా ఇచ్చేబదులు ఇష్టంతో కాఫీ ఇయ్యి, అయిష్టంగా అన్నం పెట్టే బదులు ఇష్టంగా పెట్టు, పెట్టటం ఎలాగూ తప్పదు. అయిష్టంగా మాట్లాడే బదులు ఇష్టంగా మాట్లాడు. అప్పుడు నీ ప్రారబ్ధం అంతా ఖర్చుఅయిపోతుంది, ఇంక ఇటువంటి ప్రారబ్ధం రాబోయే జన్మలో నీకు రాదు. భగవంతుడు నీకు కేటాయించిన పనిని ద్వేషంగా చెయ్యవద్దు, ప్రేమగా చెయ్యి, తరించటం పెద్ద కష్టం,

పెద్ద కష్టం అని అనుకోవద్దు, ఇలా అనుకోవటంలోనే కష్టం ఉంది.

ప్రతీ జీవుడూ రూపానికి, నామానికి కట్టుబడిపోయాడు, అందులో నుండి బయటకు రాలేకపోతున్నాడు. ఇక్కడ మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే రూపబుద్ధిని, నామబుద్ధిని తగ్గించుకోండి, ఇప్పడే, ఇక్కడే మీకు అమృతానుభవం కలుగుతుంది. రూపం లేకుండా మనస్సు ఆగలేదు, అది ఏదో రూపాన్ని చింతిస్తూ ఉంటుంది. అది రూపాన్ని పట్టుకొని పుడుతుంది, రూపాలను మారుస్తూ ఉంటుంది. ఈ రూపాలను పట్టుకొనే దీనికి రూపం ఉందా అంటే దానికి రూపం లేదు. ఈ రూపాలను పట్టుకొనే ఇది ఎవరు అని దానిని విచారణ చేయాలి. ఈ నామ రూపములు నిజంకాదు, ఇవి అన్నీ ఆరోపించబడినవి. నిజం మీకు తెలిసేవరకు నిజం మీద ఆరోపించబడినవి నిజం అనిపిస్తుంది. నిజం మీకు తెలిసాక ఈ ఆరోపించబడినది దానంతట అదే పోతుంది. భగవంతుడిని మనం ఏదీ అడగకూడదు. మనకు ఏది అవసరమో ఆయనే చూసుకొంటాడు. ప్రత్యేకంగా ఇది కావాలి అని అడగ కూడదు. ఒకోసారి మనం అడిగినవే మనకు తంటాలు తెస్తాయి. ఉదాసీనంగా ఉండటం మంచిది. ఇప్పడు నేను ఫలానా వ్యక్తిని అనుకొంటున్నావు కదా, దేహంతోటి, మనస్సుతోటి, పరిసరాలతోటి తాదాత్మ్యం పొందేవ్యక్తి ఉన్నాడు కదా. జ్ఞానం రాగానే ఆ వ్యక్తి కనబడకుండా పోతాడు అంటే జ్ఞానం వచ్చాక దేహగతమైన నేను అక్కడ కనబడదు. మనం మాట్లాడే మాట, మనం చేసే పని, దైనందిన జీవితంలో మన ప్రవర్తన ఎలా ఉండాలి అంటే అవి తిరిగి మనకు జన్మను తీసుకొని రాకూడదు. నీకు శరీరం వచ్చిందా నువ్వు వెయ్యికోట్లు ఉన్న కుటుంబంలో పుట్టినా నీకు దుఃఖం తప్పదు. దేహం వచ్చినవాడికి దుఃఖం రాకుండా ఉండదు. మీరు కర్తృత్వం పెట్టుకొని ఏది చేసినా మీకు దేహం వచ్చి తీరుతుంది. అందుచేత కర్మను కర్మగా చేయవద్దు, కర్మని యోగంగా చెయ్యి. కర్మను యోగంగా చేస్తే నీకు పునర్జన్మ రాదు.

మీకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితోటి, మీకంటే గుణవంతులతోటి, మీకంటే ఎక్కువ వివేకం ఉన్నవారితోటి, మీకంటే ఎక్కువ వైరాగ్యం ఉన్నవారితోటి మీరు సహవాసం చేస్తే వారి సంపద మీకు కూడా వచ్చేస్తుంది. బయట గొడవలు మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా వాటి ప్రభావం మీ మెదడుమీద పడనివ్వవద్దు. ఎందుచేతనంటే అవన్నీ అసత్యములే, అవన్నీ మనోకల్పితములే. ముందు మనం రాగద్వేషాలను విడిచిపెట్టాలి లేకపోతే మనం పవిత్రులం అవ్వలేము. మనకు అర్హత వస్తే, యోగ్యత వస్తే సుఖం కోసం, ఆనందంకోసం బయట వెదకనక్కరలేదు, సుఖం, ఆనందం, శాంతి మన దగ్గరకే వస్తాయి. మనం గుడిలో

ఉన్న విగ్రహాలను ఆరాధిస్తాము, దానిని ఉపాసన అంటారు, ఉపాసన వలన మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, అప్పుడు అవసరంలేని ఆలోచనలకు మనస్సు వెళ్ళదు, ఏకాగ్రత వలన మీకు శారీరకఆరోగ్యం కూడా బాగుంటుంది. ఒకోసారి భగవాన్ కొంతమంది వంక ఇష్టంగా చూసినట్లు చూసేవారు, కొంతమంది దగ్గర కూర్చొన్నవారితో అసలు మాట్లాడేవారేకాదు. ఆయన పని ఏమిటి అంటే బయట గొడవకాదు, లోపల ఆ జీవుడిని బాగుచేయటం ముఖ్యం. వారితో మాట్లాడకపోతే వారికి కోపం వచ్చేస్తుంది, మనం చాలాదూరం నుండి వచ్చాము భగవాన్ మనతో మాట్లాడటంలేదు అని కోపం వచ్చాక, దీనినే కదా నేను పోగొట్టుకోవలసింది అని అప్పుడు తెలుస్తుంది. ఒకోసారి లోపల ఉన్న మురికి మనకు తెలియదు. గురువు ఏమి చేస్తాడు అంటే నీ లోపల కెలికి వాటిని నీ సహస్రారంలోనికి తీసుకొనివస్తాడు, సహస్రారంలోనికి వచ్చాక ఆ బలహీనతలు నీకు ఉన్నాయి అని తెలియజేసి దానివలన వచ్చే నష్టం మీకు చూపించి అప్పుడు ఆ బలహీనతలను బయటకు లాగుతాడు, వాడు గురువు. మీ మర్యాదలు గురువుకు అక్కరలేదు. మీరు లోపల బాగుపడటం ఆయనకు ముఖ్యం. కొంతమందితో శాంతిగా మాట్లాడతాడు, కొంతమందితో కోపంగా మాట్లాడతాడు, కొంతమందితో హేళనగా మాట్లాడతాడు, ఇలా రకరకాలుగా మాట్లాడినా అదంతా మన మంచి కోసమే, మనలను బాగుచేయటంకోసమే మాట్లాడుతున్నాడు అని గ్రహించినవారు ధన్యులు.

ఒకోసారి మీకు రిపీటెడ్‌గా ఒకే వాసన వస్తూ ఉంటుంది, అది ఎంతో శక్తివంతంగా ఉంటుంది, అది పోదు అని మనకు అనిపిస్తుంది. మీరు కంగారుపడనక్కరలేదు, ఎంత బలీయమైన వాసన అయినా గురువు అనుగ్రహంలో కొట్టుకొనిపోతుంది. మీకు ఇంకా వెయ్యి జన్మలు తీసుకొని వచ్చే వాసనలు, సంస్కారములు మీ లోపల ఉన్నా, అవి ఉన్నట్లు మీకు తెలియజేసి ఈ ఒక్క జన్మలోనే మీచేత అనుభవింపచేసి వాటిని బయటకు లాగి మిమ్మల్ని పవిత్రులను చేస్తాడు, వాడు గురువు. మనం సుఖపడాలంటే ముందు మనం నామరూపాలను మరిచిపోవాలి. ఇవి రెండూ కల్పితాలు, ఇవి రెండూ మరిచిపోతే స్వరూప సుఖం నీకు తెలుస్తుంది. స్వరూపసుఖం మీ చేతికి అందినప్పుడు బాహ్యంగా మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వాటి ప్రభావం మీ మీద పడదు. మీ లోపల ఉన్న జ్ఞానం తాలూక ఊట మీకు దొరికితే ప్రపంచంలో ఉన్న దుఃఖం అంతా వచ్చి మీ మీద పడినా మీ మనస్సు చెదరదు, అట్టిది జ్ఞానం యొక్క వైభవం, దానిని మనం నోటితో చెప్పలేము. అది మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దాని గురించి మీకు తెలుస్తుంది.

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**
**- Mahabharatha**

# "ఐ"సెన్‌సే - నాన్‌సెన్సు

శరీరం "నేను" అనే భ్రమ కారణంగా మనం నిష్పక్షపాతంగా వ్యవహరించలేకపోతున్నాము. నేను వచ్చాకే నాది వస్తుంది. దానితో బాధలు మొదలౌతాయి. ఈ మనస్సు ఓ సత్రం లాంటిది. ఆలోచనలు, అనుభూతులు, కోరికలు అనే అతిథులు దాన్ని దర్శిస్తాయి, చేరుతాయి. ఆతిథ్యం ఇచ్చేవాడు కూడా అక్కడే ఉంటాడు ఆయన ఎవరు? అంటే వాడు ఆగిపోతాడు. ఆ "క్లూ" మనకు తెలియక నాన్‌సెన్సు గొడవల్లోకి వెళ్ళిపోతాము. మనస్సు ఆగాలంటే గురు అనుగ్రహం కావాలి. ఐ సెన్సు ఉన్నంతకాలం మనలను ఈ సమాజం పిండి పిండి చేస్తున్నది. మన ఇష్టాలు, ద్వేషాలు, సంతోషాలు అన్నీ ఐసెన్సులే అవి అన్నీ కల్పితాలు వాటితో మనకు సంబంధం లేదు. మనం ఆత్మ స్వరూపులమే. నేను ఇతరులకంటే అన్నివిధాలా ఉన్నతున్ని అనే భావనలు బలపడితే సంఘర్షణ, బాధ తప్పవు. కారణం మనం ఎప్పడూ ప్రాముఖ్యతను కాపాడుకోవాలి అని అనుకొంటాము. మన మనస్సులో కోరే కోరికలతో నిత్యము పనిచేస్తూ ఉండటం మన లక్షణం. మన రాగద్వేషాల రాపిడితో బాధపడి జీవిస్తూ ఉంటాము. మనస్సుకు సంతృప్తి అంటూ ఉండదు. గర్వంతో ప్రత్యేక వ్యక్తిగా మనలను తయారుచేస్తుంది. నిజమైన మేధావికి తన గొప్పదనం ఏమీ లేదని అంతా ఆత్మ యొక్క ప్రసాదమని భావిస్తూ ఈ కార్యసాధనకు నేను తగిన వాణ్ణి కాకపోయినా భగవంతుడు నన్ను ఎన్నుకొన్నాడని విజ్ఞతతో కృతజ్ఞతతో ఉంటాడు. ఐసెన్సు కేన్సర్‌లాంటిది. అది మనలను, ఇతరులను తినేస్తూ ఉంటుంది. శ్రీ నాన్నగారు "అహంకారాన్ని ఊహించకండి అది లేదని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి కామన్‌సెన్సుతో నాన్‌సెన్సు గొడవల్లోకి వెళ్ళకండి" అన్నారు. శరీర బాధకంటే మానసిక బాధ చెడ్డది. శరీర బాధ స్మశానంతో ముగుస్తుంది. అది ముగియదు. మనం ఎంతగా ఒక వస్తువును ఇది నాది అని పట్టుకొమటామో అది వీడు నా బానిస అని పట్టుకొంటుంది. ఒక సత్యం మాత్రమే నిజమని మిగిలినది వదిలేయాలి. మనస్సు ప్రపంచ విషయాలను చూస్తూ వాటి వెంట పిచ్చి పరుగులు తీస్తూ ఉంటుంది. అవి అన్నీ ఎండమావుల్లో జలాలు వంటివి. మనస్సును అధికమించటమే సరియైన మార్గము. మమకారాన్ని తగ్గించుకొని మనోబుద్ధులతో తాదాత్మ్యం వదిలితే కోరికలు అంతరిస్తాయి. బుద్ధి తన సాక్షిలో ఐక్యమౌతుంది, నాన్‌సెన్సు అంతమై శాంతి మిగులుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం



భద్రాచలం రామాలయం అర్చకులు శ్రీశ్రీనివాసశాస్త్రిగారు
సద్గురు శ్రీ నాన్నగార్ని సన్మానిస్తున్న దృశ్యం



అర్తమూరు భక్తులు సద్గురు శ్రీ నాన్నగార్ని సన్మానిస్తున్న దృశ్యం